''తులసమ్మ అంత పని చేసిందా?''

''అయ్యయ్యో! ఎందుకంత చెడ్డబుద్ధి పుట్టిందామెకు?''

''అయినా మనం బ్రతికేది పిల్లలకోసమేకదా!''

''అవుననుకో. ఆవిడ మనసులో ఏముందో...ఎవరికి తెలుసు?''

అక్కడొక వటవృక్షంలాంటి వేప చెట్టు. దాని చుట్టూ పెద్ద అరుగు. ఆ అరుగుచుట్టూ జనం చేరి వ్యాఖ్యానిస్తున్నారు. ఆ అరుగుమీద రాత్రి ఎప్పుడో రాలిన పండుటాకుల అనుభవాలను మోస్తూ...అందరి దృష్టినాకర్షిస్తూ ఓ ఉత్తరం గాలికి రెపరెపలాడుతోంది.

• • •

# తల్లి

- ఎ. జయలక్ష్మిరాజు



పదవ తరగతి పరీక్షలు కూడా రాయనివ్వకుండా తులసికి పెళ్లి చేశారు ఆమె తల్లిదండ్రులు.

ఇంకా చదువుకుంటానంటూ తులసి గోల చేసింది.


''మనలాంటి వాళ్ళు ఆకాశానికి నిచ్చెనలెయ్యకూడదే అమ్మడూ. నీ తర్వాత ఇంకా నలుగురున్నారు. కట్నం లేని వరుడు. టౌన్‌లో వాచ్‌మెన్ ఉద్యోగం. కాస్త రంగు తక్కువైనా కళగల మొహం. బాదరాబందీ లేదు. ముసలి తల్లి, పెళ్లికాని ఆడపడుచు. అంతే!''

మాటలతో తులసి మెడలు వంచబడ్డాయి. నీతి శతకాల పుట్టింటి సారెతో అత్తింట అడుగుపెట్టింది తులసి!

ఊరికి దాదాపు అయిదు కిలోమీటర్ల దూరంలో ముప్పై ఎకరాల పొలంలో ఓ పెద్ద భవంతి. పది గదులు, పెద్ద కాంపౌండు, పూల చెట్లు, పండ్లచెట్లు, ఆశ్రమ వాతావరణాన్ని తలపింపజేసే ఆ ఆస్తికి యజమాని రాఘవరావుగారు. అతనింటికి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు తులసి భర్త కిష్టప్ప. కాంపౌండ్‌లో ఓ మూల రెండు గదుల పెంకుటింట్లో తులసి కాపురం. యజమాని ఇంట్లో పాచి పనులతోపాటు రాఘవరావుగారి పక్షవాతపు భార్య అన్నపూర్ణమ్మ సేవలు కూడా తులసికి తప్పలేదు. రాఘవరావుగారి కొడుకులకు పెళ్లిళ్ళయి కోడళ్ళు వచ్చినా అన్నపూర్ణమ్మగారి సేవ చేయడానికి ముందుకెవ్వరూ రాకపోగా వేరే కాపురాలు పెట్టారు. తులసి ఇద్దరు పిల్లల తల్లి అయ్యాక అన్నపూర్ణమ్మగారు చనిపోయారు. రాఘవరావు భార్యా వియోగంతో పిచ్చి పట్టినట్లు తయారయ్యారు. తులసి, కిష్టప్ప దగ్గరుండి ఆయన ఆలనా పాలనా చూసుకోసాగారు. తులసి పిల్లలిద్దర్నీ కాన్వెంట్‌లో చేర్పించింది. బ్రతకడానికే ఇబ్బంది లేదనుకుంటున్న సమయంలో రాఘవరావుగారి కొడుకులు, కోడళ్ళు రంగంలో ప్రవేశించి కిష్టప్పను ఇల్లు ఖాళీ చేయించారు. అప్పుడు కూడా తులసి బాధపడలేదు. కిష్టప్ప బాధపడుతుంటే మనకూ వారికీ రుణం తీరిందని ఓదార్చింది. రాఘవరావుగారింటికి దగ్గర్లోనే నేషనల్ పార్క్ ఏర్పడింది. పార్కు దగ్గర బజ్జీల వ్యాపారం మొదలుపెట్టారు కిష్టప్ప దంపతులు. కొడుకు కుమార్‌ను, కూతురు సుశీలను శ్రద్ధగా చదివిస్తున్నారు.

రాఘవరావుగారిని ఆస్తి పంచమంటూ పిల్లలు పట్టుబట్టారు. ఆస్తి అంతా పిల్లల పేర రాసేసారు. పార్కుకు ఆనుకుని వున్న మూడెకరాల బీడుభూమిని తులసి పేర రాశారు. సుశీల పేర పదివేల రూపాయల ఫిక్స్‌డ్ చేసి తన భార్యకు తులసి చేసిన సేవలకు ఈ విధంగా రుణం తీర్చుకున్నానని చెప్పి తీర్థయాత్రలకెళ్లిపోయాడు.

రాఘవరావుగారిచ్చిన మూడెకరాల పొలంలో ఓ మూల పెంకుటిల్లు వేసుకున్నారు. పొలం చుట్టూ కంచె వేసుకుని చుట్టూ వేపచెట్లు, మామిడి, జామ, బొప్పాయి చెట్లు వేసారు. మధ్యలో వున్న పొలమంతా ఆకుకూరలు పండించసాగారు. ఓ సంవత్సరం కష్టపడి బోరు వేయించుకున్నారు. తులసి ఆ పొలాన్ని, ఆ చెట్లను ప్రాణ సమానంగా చూసుకుంది. పెంకుటింటి ముందు ఓ వేపచెట్టువేసి దాని చుట్టూ రచ్చబండ లాంటి పెద్ద అరుగు కట్టించింది తులసి. పిల్లలకు అన్నం తినిపించడం మొదలుకుని అన్ని పనులు, కబుర్లు అరుగుమీదే చేసుకునేది. సాయంకాలమయ్యేసరికి ఇరుగుపొరుగు అమ్మలక్కలు చేరి కబుర్లాడుకునేవారు. తులసికిప్పుడు ఓ కొత్త ప్రపంచం ఏర్పడింది. ఆ ప్రపంచం అంతా ఆ మూడెకరాల పొలం,



## ఆగస్టు జ్ఞాపకాల్లో కొన్ని...

ఆగస్టు 15, 1947న భారతీయులకు ఆంగ్లేయుల పాలన నుండి స్వాతంత్ర్యం లభించింది.
స్విట్జర్లాండ్ జాతీయ ఉత్సవం ఆగస్టు 1వ తేదీన జరుపుకుంటుంది. ఆగస్టు 4, 1914న మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. గొప్ప విద్వాంసుడుగా, సాహిత్యాభిలాషిగా, రచయితగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆగస్టు 7, 1941న మరణించాడు.
అద్భుతమైన పెన్సిలిన్ మందును కనిపెట్టిన సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ ఆగస్టు 8, 1881న జన్మించాడు.
మన జాతీయ నాయకులు ఆగస్టు 9, 1942న కారాగారంలో బంధించబడ్డారు. ఆనాటి నుండే దేశ స్వాతంత్ర్యానికి ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.
పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 14న జరుపుకుంటుంది.
ఆగస్టు 8, 1942న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బొంబాయిలో గోవాలియా టాంక్ మైదాన్‌లో జరిగిన చారిత్రక సమావేశంలో 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ప్రతిపాదించింది.
ఆగస్టు 6, 1945న జపాన్‌లో హిరోషిమా మీద మొదటి అణుబాంబు ప్రయోగింపబడింది. జపానులో నాగసాకి మీద రెండవ అణుబాంబు ఆగస్టు 9, 1945న ప్రయోగింపబడింది. ఈక్వెడార్ (దక్షిణ అమెరికా) స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 10న జరుపుకుంటుంది. ''లేడీ ఆఫ్ ది లాంప్'' అని చెప్పబడే ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆగస్టు 13, 1910న మరణించింది. దక్షిణ అమెరికాలోని బొలీవియా, ఆగస్టు 5న స్వాతంత్ర్య దినోత్సవం చేసుకుంటుంది.

- జి.శారద

దానిలోని చెట్లు, పంట, కాపు, పూలు, పిందెలు. తులసి తులసమ్మగా మారిపోయింది. కిట్టప్ప వ్యాపారం బజ్జీలనుంచి చికెన్ కబాబ్‌లోకి మారింది. కుమార్‌ను తమ రెక్కల కష్టంతోనే యంఎస్సీదాకా చదివించారు. కూతురి పెళ్లి చేసారు. కుమార్‌కు బ్యాంక్ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. తండ్రిని వ్యాపారం మాన్పించాడు. లోను తీసుకుని మంచి ప్లాటు కొని ఇల్లు కట్టించాడు. ధనవంతుల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. కుమార్ పెళ్లయిన సంవత్సరానికంతా కిట్టప్ప చనిపోయాడు. తులసి ఒంటరిదయింది. ఆ పొలం వదిలేసి తమ ఇంటికి రమ్మని తల్లిని బ్రతిమిలాడాడు కుమార్. ససేమిరా రానంది తులసమ్మ. ఆ పొలం చుట్టూ, పార్కు చుట్టూ క్రిక్కిరిసిన షాపులు, ఇళ్ళు, కాంప్లెక్సులూ ఏర్పడ్డాయి. మూడెకరాల పొలం లక్షల ధర పలుకుతోంది. అమ్ముతారా అంటూ రోజూ బేరానికి జనం రాసాగారు. ఎవరికీ అమ్మే ప్రసక్తి లేదని ఖండితంగా చెప్పింది తులసమ్మ.

కుమార్, అతని భార్య అప్పుడప్పుడు వచ్చి తులసమ్మను చూసి పోతుంటారు. వచ్చినప్పుడు తమతో వచ్చేయ్యమని బ్రతిమిలాడడం, ఆమె రాననడం పరిపాటయిపోయింది.

ఓరోజు కుమార్ ఒక్కడే వచ్చాడు తల్లిని చూడడానికి.

వేపచెట్టు కింద అరుగుమీద కూర్చుని దినపత్రిక చదువుకుంటోంది తులసమ్మ. కొడుకు రాగానే ''అమ్మాయేది?'' అంది.


''రాలేదమ్మా. నేనే నీతో మాట్లాడదామని వచ్చాను.''

''ఏమిట్రా విషయం?''

''ఈ మూడెకరాలూ మంచి ధర పలుకుతోంది. ఇందులో సగం అమ్మేసి మిగతా సగంలో షాపింగ్ కాంప్లెక్స్ కట్టించాలని అనుకుంటున్నాను. షాపింగ్ కాంప్లెక్స్ కట్టి అద్దెకిచ్చేశామంటే నెలకు యాభైవేలకు పైగా అద్దె వస్తుంది. జల్సాగా వుండవచ్చు. నీవు ఈ స్థలం వదిలేసి వచ్చి నా దగ్గరే వుందువుగాని. నువ్విప్పుడు చేయవలసిందల్లా ఈ స్థలం నీ పేర నుంచి నా పేర రిజిస్టర్ చేయించాలి. అలా చేస్తే నాకు లోను కూడా ఇస్తారు'' అంటూ వచ్చిన పని గురించి సూటిగా తేల్చి చెప్పేశాడు.

కుమార్ మాటలకు కలవరపడింది తులసమ్మ. కాసేపు నోట మాట రాలేదు.

''మరి...ఈ చెట్లు, ఈ ఇల్లు...'' అంది తడబడుతూ.




''ఏంటమ్మా? ఈ చెట్లు ఎంతసేపు గంటలో మనిషిని పెట్టి నరికించెయ్యనూ. ఈ ఇల్లు...అసలు దీన్ని ఇల్లంటారా? గబ్బిలాల గూడు. ఇన్నేళ్ళు ఈ ఇంట్లో ఎలా పెరిగానా అని నాకే ఆశ్చర్యమేస్తుంది'' అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

తులసమ్మకు అతని మాటలు వింటూ వుంటే వళ్లంతా కంపరమొచ్చింది. కళ్లల్లోంచి, చెవుల్లోంచి ఆవిర్లు వచ్చాయి. తమాయించుకుంది. కొడుక్కి సర్ది చెప్పాలన్న ప్రయత్నంలో...

''ఈ చెట్లు...ఇంత పెద్ద వృక్షాలుగా మారడానికి ఎన్నేళ్ళు పట్టిందో నీకు తెలుసుకదా. ఈ చెట్లకు నీవూ నీళ్ళు పోసావు. పాదులు చేశావు. ఇప్పుడు నీవే గంటలో నరికేస్తానంటున్నావు. అంత తేలిగ్గా ఎలా అనగలుగుతున్నావురా!'' అంది.

'అబ్బా...అమ్మా! వృక్షశాస్త్రం పాఠాలు నాకు చెప్పకు. నీక్కావాల్సింది చెట్లు. చెట్లంటే నీకిష్టం. అంతే కదా! ఇప్పుడు నేనుంటున్న ఇంటి వెనక బోలెడు ఖాళీ స్థలం వుంది. తీరిగ్గా చెట్లు పెంచుకుందువుగాని పద.''

''అసలిప్పుడు నీవు కాంప్లెక్స్ కట్టకపోతే ఏం? ఏం తక్కువైంది నీకు? మంచి ఉద్యోగం, ఇల్లు, ఆస్తిగల భార్య...ఇంకా ఎంతో భవిష్యత్తు వుంది. ఇంకా ఈ చెట్లను నరికి ఈ స్థలం అమ్మి కాంప్లెక్స్‌లు కట్టి అంత డబ్బు ఏం చేసుకుంటావు? అంత ఆశ పనికిరాదురా?'' కుమార్‌కు కోపం నసాళానికి అంటింది.

''ఈరోజో రేపో పోయేదానవు. చచ్చేదాకా ఇంత విలువగల ఆస్తికి స్వంతదారునని అనిపించుకోవాలని నీకు ఆశలేదా?'' విసురుగా అన్నాడు.

''నేనీ స్థలం విలువ గురించి, ఆస్తి గురించి ఆలోచించడంలేదు నాన్నా. నా బాధంతా ఈ చెట్ల గురించే. వీటిని నరికేయడం లాంటి పనులను నేను బ్రతికుండగా చూడలేను.''

''అలాగేం! అయితే నువ్వు వెళ్లిపోయాకే కాంప్లెక్స్ కడతాను. అసలు చెట్ల గురించి అంత బాధపడతావెందుకమ్మా? కష్టపడి నీవు పెంచిన ఈ చెట్లు నాకూ నీకూ ఉపయోగపడతాయికదా. వాటిని నరికితే బోలెడు కలప. నేను కట్టబోయే కాంప్లెక్స్‌కి ఉపయోగపడతాయి, లేదా అమ్ముకోవచ్చు!''

అలా మాట్లాడుతున్న కొడుకుని వాడిగా చూసింది తులసమ్మ.

ఆమె కళ్లకు అతను మనిషి బ్రతికుండగానే కళ్ళు, కాళ్ళు, చేతులు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు అమ్ముకుని సొమ్ము చేసుకునే రాక్షసుడిలా కనిపించాడు. 'నేను కనీ పెంచిన కొడుకేనా వీడు?' మనసులో అనుకుని నమ్మశక్యం కానట్టు చూసింది తులసమ్మ.

''నేనెంత కష్టపడినా, సంపాదించినా పిల్లలు బాగుండాలనే, వాళ్ళ భవిష్యత్తు కోసమే. నేను బ్రతికేది కొడుకు, కూతురి కోసమే అనే దానివికదా. ఇప్పుడు నేను ఇంకాస్త డబ్బు సంపాదించి ఇంకా జల్సాగా బ్రతకడం నీకిష్టంలేదా? ఆఫీసుకు టైమవుతోంది. వెళ్తొస్తాను. ఓ వారంరోజుల తరువాత మళ్ళీ వస్తాను. ఈ పొలం నా పేర రిజిస్టర్ చేయించడానికి సిద్ధంగా వుండు'' ఆజ్ఞాపించినట్లు అని వెళ్లిపోయాడు కుమార్.

స్త్రీ చిన్నప్పుడు తండ్రి అదుపాజ్ఞలలో, వయసొచ్చాక అన్నదమ్ములు, పెళ్లయ్యాక భర్త, ముసలి వయసులో కొడుకుల అదుపాజ్ఞల్లో ఉండాలని...తానింకా పుట్టకముందే ఈ వ్యవస్థ నిర్ణయించింది. ప్రస్తుతం తను కొడుకు అదుపాజ్ఞలలో ఉండే స్థితికొచ్చిందన్నమాట!

విరక్తిగా నవ్వుకుంది తులసమ్మ.

• • •

వారంరోజుల తరువాత కుమార్ ఉదయమే లేచి తల్లి దగ్గరకొచ్చాడు. అక్కడ వేపచెట్టు కింద అరుగుచుట్టూ జనం గుమిగూడి ఉండడంచూసి కంగారుపడ్డాడు కుమార్. ఖాళీ పెంకుటిల్లు బార్లా తెరిచి వుంది. అరుగుమీద ఓ పెద్ద తెల్లకాగితపు ఉత్తరం గాలికెగిరిపోకుండా చిన్నరాయి ఆసరాతో ఉంది. అప్పటికే అందరూ ఆ ఉత్తరాన్ని చదివిన గుర్తుగా బాగా నలిగిపోయి కుమార్ కోసం ఎదురు చూస్తున్న తల్లిలా వుంది. అక్కడికి చేరుకున్న కుమార్ అందరివైపోసారి చూసి ఉత్తరం చేతిలోకి తీసుకున్నాడు. అంతదాకా గుమిగూడివున్న జనం తలో దారిన వెళ్లిపోయారు. ఎవరో ఒకరిద్దరు మాత్రం ఉత్తరం చదివాక అతని ఫీలింగ్స్ ఎలా వుంటాయో చూద్దామన్నట్లు నిలబడిపోయారు.

''నాన్నా కుమార్!

నేను చదువుకున్నాను. కానీ ఎప్పుడూ ఉత్తరాలు రాసే అవసరం రాలేదు. పదిహేనేళ్ళు నిండగానే కాపురానికి వచ్చాను. మీ నాన్నగారు నాకు చాలా విలువ ఇచ్చారు. నాతో సంప్రదించకుండా ఏ పనీ చేసేవారు కాదు. అప్పటినుంచి ఇప్పటివరకు మన కుటుంబానికి సంబంధించిన ప్రతి పనికీ నా నిర్ణయమే అమలు జరుగుతోందని నేను గర్వంగా చెప్పుకుంటున్నాను. కానీ అయ్యో! ఇలాంటి నిర్ణయం తీసుకున్నానే అని ఎప్పుడూ బాధపడలేదు. నష్టపడలేదు. కానీ నా ఇప్పటి నిర్ణయం నిన్ను బాధపెట్టవచ్చు. నష్టపెట్టొచ్చు. బాబూ! ఈ ప్రపంచంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క ప్రపంచమంటూ వుంటుంది. కొందరికి డబ్బు ప్రపంచం, కొందరికి కళల ప్రపంచం, కొందరికి ప్రేమ ప్రపంచం. ఇలా ఎన్నో ప్రపంచాలు. కానీ ఈ దేశంలో స్త్రీకి మాత్రం భర్త, పిల్లలే ప్రపంచం. ఒక స్టేజికి వచ్చాక కొంతమందికి ప్రపంచాలు మారుతుంటాయి. ఎందుకంటే బాధ్యతలు తీరిపోయి వుంటాయి కాబట్టి. అప్పటివరకూ నిక్షిప్తమై వున్న ఓ ప్రపంచం బాధ్యతల బరువు వదలగానే తేలిక అయిపోయి ఈ కొత్త ప్రపంచం వ్యాపకమైపోతుంది. ప్రస్తుతం నా ప్రపంచం కూడా మారిపోయింది. నాకు ఎప్పుడూ నా ప్రపంచం గురించే తప్ప ఇంకో ప్రపంచం తెలియదు. వాతావరణ కాలుష్యం గురించీ, ఓజోన్ పొర గురించీ కాస్త తెలుసు. ప్రస్తుతం నా ప్రపంచమంతా ఈ మూడెకరాల పొలంలో ఈ చెట్లు. నిన్ను, చెల్లినీ ఎలా పెంచి పెద్ద చేశానో ఈ మూడెకరాలలో ఈ చెట్లనూ అలాగే పెంచి పెద్ద చేశాను. నీకు జ్వరమొస్తే ఎలా తల్లడిల్లానో, తుపాను గాలికి ఆ చెట్లు పిచ్చిపట్టి ఊగితే ఎక్కడ కొమ్మలు విరుగుతాయో, నేల కూలుతాయోనని తల్లడిల్లాను. నువ్వు రోజుకో అక్షరం నేర్చుకుంటే ఎలా పొంగిపోయానో, ఆ చెట్లు రోజుకో చిగురు తొడిగితే అలాగే మురిసిపోయాను. పుస్తకాల్లో రాసినవి చదివి నీకు పోషకాహారం పెట్టినట్టే వాటికీ బలవర్ధకంగా ఎరువులు వేసాను. నీతోపాటు ఆ చెట్లు కూడా ఇంతై ఇంతింతై పెరిగాయి. నాతో ఎవరికీ వినిపించని ఊసులాడాయి. బాధను పంచుకున్నాయి. ఆకులను రాల్చి కన్నీళ్లు తుడిచాయి. మీ నాన్నగారు పోయి నేను ఒంటరినై బ్రతుకుమీద విరక్తి కలిగినప్పుడు ఆ చెట్లు మీద వాలే పక్షులను, పిచ్చుకలను, కాకులను చూపించి 'నోరులేని జీవులు బ్రతగ్గాలేంది నీవు బ్రతకలేవా? మేమంతా నీకు తోడున్నామంటూ' చల్లటి గాలితో ఓదార్చాయి. ధైర్యం చెప్పాయి. అంతేగానీ ఆ చెట్లు తమని పెంచినందుకు ప్రతిఫలంగా ఉద్యోగాలడగలేదు. ఆస్తులూ, వాటాలు అడగలేదు. నీవూ, సుశీల నా జీవితంలో ఎలా నిండిపోయారో ఆ చెట్లు కూడా నా మనసులో నిండిపోయాయి. రెండు కళ్లల్లో ఏ కన్ను పొడుచుకుంటావో చెప్పమంటే ఎవ్వరైనా ఏం చెబుతారు? అలాంటిదే నా పరిస్థితి కూడా. ఇప్పుడు నీవు వున్న ఫళాన అంత పెద్ద వృక్షాలను నరికేసి కాంప్లెక్స్ కడతానంటుంటే తోడబుట్టినవాడిని చంపి ఆస్తి కాజేసేవాడిలా కనిపిస్తున్నావు. ఈ బిజినెస్ యుగంలో డబ్బే ప్రపంచమయిన నీకు నా మాటలు, చేష్టలు అర్థం కాకపోవచ్చు. నిష్కృతిలేని బాధ నాది. ఒక ఆత్మీయున్ని పోగొట్టుకుంటున్నప్పుడు, ఒక ప్రేమ దూరమైనప్పుడు, కళ్లముందు కన్నబిడ్డలు ఒకరినొకరు హత్యలు చేసుకుంటున్నప్పుడు, నమ్మిన కాళ్లకింద నేల దిగబడిపోయినప్పుడు ఆ బాధను తట్టుకోలేం. ఆ బాధలకు పరిష్కారమార్గమూ వుండదు. ఆలోచించాను. కన్నీరు కార్చాను. నీ ఆలోచనను సమర్థించి అమలు జరిపితే పూడ్చలేని ఈ నష్టం జీవితాంతం దుఃఖిస్తూ వుండమని నన్ను శపిస్తాయి. ఆ ఆలోచనల్లోంచి పరిష్కారమనే వెలుగు కనిపించి కన్నీరు తుడిచి వెన్నుతట్టి నిబ్బరంగా నిలబెట్టింది. ఏ కన్నూ పొడుచుకునే అవసరం లేదనిపించింది. అందుకే ఈ మూడెకరాల పొలాన్ని పార్కులో కలుపుకోవాల్సిందిగా మున్సిపాలిటీ చైర్మన్‌గారికి తెలిపి పార్కుకు చెందేలా రిజిస్టరు చేయించాను. ఈ నిర్ణయంతో కొడుకంత చెట్లను కాపాడుకుంటున్నాను. నా నిర్ణయం నీకు బాధ కలిగించవచ్చు. కానీ ఒక తల్లిగా, నా బాధ్యత సక్రమంగా నిర్వర్తించానన్న తృప్తితో మీకు దూరంగా వెళ్లిపోతున్నాను. ఆశీస్సులతో

అమ్మ.''

ఉత్తరం చదవడం ముగించి స్థాణువులా నిలుచుండిపోయాడు కుమార్. ఎప్పటికో తేరుకుని చుట్టూ చూస్తే ఎవ్వరూలేరు. ఒక్కసారి ఆ పొలంలోనున్న చెట్లన్నింటి వైపు దృష్టి సారించి చివరికి తల పైకెత్తి వేపచెట్టును కన్నీళ్లతో చూసాడు. చిరుగాలికి చెట్లు ఆకులు కదిలాయి. గుండెల్లోని భారమంతా బయటకు వెళ్ళగక్కే ప్రయత్నంలో అశ్రుతర్పణంతో తల్లి రుణం తీర్చుకుంటున్నామన్నట్లు చెట్టుపైనున్న మంచు బిందువులు తులసమ్మ రాసిన ఉత్తరంపై పడి తడిపేసాయి. ★

## హిట్ పెయిర్



అనిల్‌కపూర్, మాధురి ఒకప్పటి హిట్ పెయిర్. ఇప్పట్లో ఇద్దరూ కల్సి ఏదైనా పిక్చర్‌లో కలుస్తారా అని అనిల్‌ని అడిగితే... అవకాశం వస్తే తప్పక నటిస్తాను. మాధురికి పెళ్ళయినంత మాత్రాన గ్లామర్ తగ్గిందని ఎవరు చెప్పారు? ఇంకా ఎక్కువయింది. ఆవిడ నా అభిమాన నటి అని చెప్పాడు అనిల్‌కపూర్.

## శ్రీదేవి ప్రెగ్నెన్సీ- కాజోల్‌కి వరం

ఇదేంటీ అనుకుంటున్నారా? శ్రీదేవికి రెండోసారి ప్రెగ్నెన్సీ రావడం నిజంగా కాజోల్‌కి వరమే అయింది. బోనీకపూర్ నిర్మిస్తున్న చిత్రంలో షారూఖ్ పక్కన శ్రీదేవి నటించాలనుకుంది. అయితే ఈలోగా శ్రీదేవి ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ కావడంతో ఆ క్యారెక్టర్ కాజోల్ చేస్తోంది. అంతేకాదు, అజయ్‌దేవగన్ కూడా ఒప్పుకున్నాడుట ఈమె నటించడానికి. ఇంకేం కాజోల్! రెచ్చిపోయి నటించు. ఆల్ ది బెస్ట్.

## అజయ్ దేవగన్ కోరిక

అజయ్‌దేవగన్‌కి హఠాత్తుగా ఓ కోరిక పుట్టిందండోయ్! ఎలా అయినా ఓ సినిమా డైరెక్ట్ చేసెయ్యాలని. తన కోరిక ఎంతోమందితో చెప్పినా ఎవరూ అవకాశం ఇవ్వడంలేదట. చూసి, చూసి నేనే ఓ చిత్రాన్ని నిర్మించి, డైరెక్ట్ చేసిపారేస్తా! అప్పుడెలా చూడరో పబ్లిక్ అని డిసైడయ్యి, టైంకోసం ఎదురుచూస్తున్నాడట. సో! ప్రేక్షక మహాశయులారా! బీ రెడీ ఫర్ దట్.

- విరాజి

